క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో తిరుపతిరెడ్డి

కొడంగల్: కొడంగల్, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు మండలాల నుంచి పలు పార్టీల కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఇందులో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఆనంద్‌రెడ్డి, బోడి వెంకట్‌రెడ్డి, తార్యానాయక్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

యాలాల: మండల పరిధి పగిడియాల గ్రామానికి చెందిన కొత్త కుర్వ అనంతయ్య ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత బుయ్యని మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబానికి పార్టీ తరపున రూ.5 వేలను స్థానిక ఉప సర్పంచ్ నర్సింహులు గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఇందులో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కాలప్ప ఉన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంపొందించుకోవాలని టీడీపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, వీరాపూర్ సర్పంచ్ జనార్దన్ రెడ్డిలు సూచించారు. ఆదివారం చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ఇందులో ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు రవి, స్థానిక నేతలు ఎండీ ముజీబ్, శేఖర్, కృష్ణ, పాండు, రవీందర్ రెడ్డి, నిరంజన్, రమేష్, ప్రశాంత్, జహంగీర్, కృష్ణ ఉన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఎంపీపీ



ఎంపీపీకి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీకి చెందిన వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీతో పాటు ఆమె భర్త సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కమాల్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వికారాబాద్‌కు చెందిన డాక్టర్ భరత్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు దేవదాసు పార్టీలో చేరారు.

విద్యుత్ యంత్రాలకు పూజ



పూజలు చేస్తున్న ఏఈ కిషోర్

దోమ: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రం సబ్‌స్టేషన్‌లో ఆదివారం విద్యుత్ యంత్రాలకు పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిషోర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దసరా ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఇందులో విద్యుత్ సిబ్బంది మహేందర్, నర్సింహులు ఉన్నారు.

'గర్జన'కు తరలిన మాలలు



సభకు వెళ్లిన మాల నేతలు

కుల్కచర్ల: మాలలు ఆర్థికంగా వెనుకబాటుకు గురౌతున్నారని మాలమహానాడు మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలో నిర్వహించిన మాలల గర్జన బహిరంగ సభకు కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి మాలలు భారీగా తరలి వెళ్లారు. ఇందులో వెంకటేశ్ ఉన్నారు.

ఎంపీపీకి అస్వస్థత

బొంరాస్‌పేట: ఎంపీపీ హేమిబాయి అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెకు.. సమస్య ఎక్కువ కావడంతో ఆదివారం మెరుగైన వైద్యం చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎంపీపీ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు.



ధారూరు: మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారు



కొడంగల్ రూరల్: విశేష అలంకరణలో కాళికామాత



ధారూరు: దుర్గామాత అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



బొంరాస్‌పేట: దుర్గామాత అవతారంలో అమ్మవారు దర్శనం



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో మహాదేవి అవతారంలో అమ్మవారు

మహిషాసుర మర్దినిగా అమ్మవారు



పెద్దేముల్: జనగాంలో అమ్మవారికి భక్తుల పూజలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాలు, మండపాలు భక్తజనులతో కిటకిటలాడాయి. 8వ రోజైన ఆదివారం అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తజనం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



బొంరాస్‌పేట: దుర్గామాత సన్నిధిలో భక్తులు

ఆదాయమే తప్ప.. ప్రజారోగ్యం పట్టదా?

- రాష్ట్రంలో జోరుగా మద్యం విక్రయాలు
- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం
- రానున్నది ఇందిరమ్మ రాజ్యం
- నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపనున్న కాంగ్రెస్
- ఇంటింటి ప్రచారంలో హస్తం నాయకులు



ధారూరు: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు/కుల్కచర్ల: 'తెలంగాణలో రానున్నది ఇందిరమ్మ రాజ్యం. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ అధికారం చేపట్టబోతుంది' అని ఆ పార్టీ నేతలు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆ పార్టీ నేతలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వడం లేదు. వ్యవసాయ పనిముట్ల రాయితీకి మంగళం పాడి వారికి తీరని అన్యాయం చేసింది. ఆదాయమే పరమావధిగా మద్యం విక్రయాలను ప్రోత్సహించి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోంది' అని ఆరోపించారు. ధారూరు మండల కేంద్రంలో హస్తం నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జాతీయ పార్టీ కాంగ్రెస్.. తెలంగాణ ఇస్తే.. తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంటుందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల నియామకం అంటూ యువతను దశాబ్దకాలంగా మభ్యపెట్టి, వారు ఆత్మహత్యలకు పాల్పడేలా చేసిందని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే.. మాయ మాటలతో మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే గ్యారంటీ పథకాలతో పాటు, మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేసి, ప్రజలకు మేలు చేస్తామని చెప్పారు. ఇందులో పార్టీ జిల్లా, మండల నాయకులు బుజ్జయ్యగౌడ్, మహ్మద్ బాబాఖాన్, లింగనపల్లి అశోక్, తిరుపతిగారి మల్లేశం, ముజాఫర్, దావూద్ ఉన్నారు.

నియంతృత్వ పాలనలో..

కుల్కచర్ల: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అవినీతి, నియంతృత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయి, కొత్త పాలనకోసం ఎదురుచూస్తున్నారని, ఆ రోజులు ఇంకా ఎంతో దూరంలో లేవని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం చాపలగూడెంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు కుమ్మరి స్వామి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ పద్మమ్మ, పలువురు వార్డు సభ్యులు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్ 2 అధ్యక్షుడు భరత్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్, అంతారం సర్పంచ్ కృష్ణయ్య, నాయకులు కుమ్మరి స్వామి, కృష్ణయ్య, మొగులయ్య, యాదయ్య, వినోద్, అంజి ఉన్నారు.



కుల్కచర్ల: కాంగ్రెస్‌లో చేరిన పలువురు

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు జరిగి, పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, రైతులకు ఏక కాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఎంపీటీసీ మంజుల, నాయకులు మహిపాల్ ఉన్నారు.

అధికార పార్టీలో పెరిగిన అవినీతి



పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మండల పరిధి బార్లపల్లికి చెందిన మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌లో అవినీతి పేరుకుపోయిందని ఆరోపించారు. నేటికీ గ్రామాల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. ఇందులో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, శంకర్ ఉన్నారు.



కొడంగల్: ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలి
- ఎన్నికల ప్రచారంలో గులాబీ శ్రేణులు

కొడంగల్: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, తొమ్మిదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ ఫలాలను గుర్తించి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని ఆ పార్టీ శ్రేణులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు కాలనీల్లో రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మవద్దని, తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం కట్టబెట్టాలని కోరారు.

ప్రజలకు ఎల్లప్పుడూ..

కొడంగల్ రూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఇందులో పార్టీ నాయకులు రమేష్, కుశలప్ప, కోస్గి దస్తప్ప, వెంకటయ్య, మోహన్ ఉన్నారు.



కొడంగల్ రూరల్‌లో..

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల పరిధి ఇందాపూర్, దౌల్తాబాద్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు హితిషీరెడ్డి విస్తృతంగా పర్యటించారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కొడంగల్ అభివృద్ధి చెందాలంటే మరోసారి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఇందులో జెడ్పీటీసీ మహిపాల్, నాయకులు సంతోష్, నర్సింహులు, గోవిందు ఉన్నారు.

అగ్నిపథ్‌కు ఐదుగురి ఎంపిక

కొడంగల్ రూరల్: అగ్నిపథ్‌కు తమ గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు ఎంపికవడం హర్షనీయమని సర్పంచ్ సయ్యద్ అంజద్ అన్నారు. ఆదివారం జీపీ కార్యాలయ ఆవరణలో ఉద్యోగాలకు ఎంపికయిన ఎస్.సుదర్శన్, డి.ఆంజనేయులు, బండారి మోహన్, గొల్ల శ్రీనివాస్, చిల్ముల శివకుమార్‌లను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదువుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. వీరిని గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇందులో ఉప సర్పంచ్ మొగులయ్య, ఎంపీటీసీ గోవిందమ్మ ఉన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

బొంరాస్‌పేట: ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు తెలంగాణ ఉద్యకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత ఎరన్‌పల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆదివారం ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, అందుకే అధికార పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. త్వరలో బహిరంగసభ నిర్వహించి అందరి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరతానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివకుమార్‌సింగ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ వెంకటయ్య, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింహులు, సంజన్‌సింగ్, శివప్రసాద్ ఉన్నారు.



ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో శ్రీనివాస్ తదితరులు

'అంజన్న' గెలుపు ఖాయం

కేశంపేట: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని, ముచ్చటగా మూడోసారి అంజన్న ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమని ఎంపీపీ రవీందర్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని సంగెం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ రవీందర్‌యాదవ్ హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. కుల వృత్తులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఎన్నికల సమయంలో కొన్ని పార్టీల నాయకులు స్వార్థ ప్రయోజనాకోసం, అధికార దాహంతో మాట్లాడుతున్నారని, వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరు బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి అంజయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ జగదీష్‌గౌడ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్, వేణుగోపాల్‌చారి, బాలస్వామి, బాల్‌రాజ్, విష్ణు, తిరుమలేష్, యాదగిరి, కృష్ణయాదవ్, జంగయ్య, భగవాన్‌రెడ్డి, యాదగిరి, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జీవాల విక్రయం

వికారాబాద్ అర్బన్: దసరా వేడుకలను పురస్కరించుకుని మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వాటి ధరలు అమాంతం పెరిగాయి. వికారాబాద్ మార్కెట్‌లో నాలుగు రోజులుగా సుమారు రెండు వేల జీవాలు విక్రయించినట్లు వ్యాపారులు తెలిపారు. సోమవారం జరిగే సంతలో మరింత జోరు కొనసాగనుందని వెల్లడించారు.



మేకలను అమ్ముతున్న వ్యాపారులు

మూడేళ్లుగా పత్తాలేని సర్వేయర్

- దోచుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- భూ సర్వే కోసం తహసీల్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం

పెద్దేముల్: పర్మినెంట్ భూ సర్వేయర్ లేక.. ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తి సేవలు అడుగంటుతుండటంతో మండలంలో సర్వే సమస్యల చిట్టా పేరుకుపోతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సర్వేల కోసం దరఖాస్తు చేసినా ఎవరూ స్పందించడం లేదని, పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా మూడేళ్లుగా సమస్యకు పరిష్కారం దొరకటం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుత సర్వేయర్ దళారులకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. గుంట భూమి సర్వే చేయాలన్నా నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయవలసి వస్తుందని రైతులు అంటున్నారు.

సమస్యగా మారిన సర్వే

మండల పరిధిలో 30 రెవెన్యూ గ్రామాలున్నాయి. రైతులు భూములు కొనాలన్నా, విక్రయించాలన్నా భూ సర్వే ముఖ్యం. సర్వే కానిది భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవటం లేదు. రైతులు భూ సర్వే కోసం చలాన్లు కట్టి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని పరిసర ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత్యంతరం లేక కొంత మంది రైతులు ప్రైవేట్ వ్యక్తులతో సర్వేలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సుమారు మూడేళ్లుగా ప్రభుత్వ సర్వేయర్ జాడలేదని, గతంలో ఉన్న పర్మినెంట్ సర్వేయర్ మహేందర్ బదిలీపై వికారాబాద్‌కు వెళ్లటంతో నాటి నుంచి ఇన్‌చార్జి సర్వేయర్‌గా తాండూరు మండలానిని చెందిన శ్రీహరికి బాధ్యతలు అప్పగించారు. తరువాత ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ద్వారా నషీర్‌ను ఏర్పాటు చేసింది. కానీ.. వారు విధులకు సక్రమంగా రావటం లేదని స్థానికులు చెప్పారు. దీంతో మండలానికి సర్వేయర్ కొరత ఏర్పడింది.

వందల్లో పెండింగ్..

సర్వే కోసం చేసుకున్న అర్జీలు వందల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఎకరా భూమికి రూ.295 మీ సేవలో చలాన్ కట్టి, తహసీల్‌లో అర్జీ పెట్టుకున్నా.. అవి కార్యాలయానికే పరిమితం అవుతున్నాయని రైతులు ఆరోపించారు. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను ప్రశ్నించగా.. సర్వేయర్ రావటం లేదని చెబుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వ సర్వేయర్‌ను నియమించే వరకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సర్వేయర్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

దోచుకుంటున్నారు..



పర్మినెంట్ సర్వేయర్‌ను నియమించాలి. భూ సర్వేల కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వెంటనే పర్మినెంట్ లేదా ఇన్‌చార్జి సర్వేయర్‌ను అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. అప్పుడే తమ కష్టాలు తీరుతాయి. భూ సర్వేలు కాక నష్టాల పాలవుతున్నాం. ప్రైవేట్ సర్వేయర్లు దోచుకుంటున్నారు.

– నర్సింహులు, రైతు, హన్మాపూర్

సమస్య రాకుండా చూస్తాం..



పర్మినెంట్ సర్వేయర్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం వాస్తవమే. ఇప్పటికే సర్వే కోసం చాల మంది రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇన్‌చార్జి సర్వేయర్ శ్రీహరి రోజుకు ఒకటి, రెండు తప్ప ఎక్కువ చేయటం లేదు. తప్పకుండా ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చుస్తాం. రైతులు సహకరించాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కొత్త సర్వేయర్ వస్తేనే సమస్యలకు పరిష్కారం. మరో మార్గం లేదు.

– కిషన్, తహసీల్దార్, పెద్దేముల్ మండలం